క్లుప్తంగా

ఘనంగా మదన గోపాలుని గ్రామోత్సవం



మదన గోపాలస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కొయ్యలగూడెం: రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి గ్రామోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు నిత్య హోమం, బలిహరణ నిర్వహించి దేవేరులతో సహా స్వామి వారికి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు చేపట్టారు. ఆలయ అర్చకులు గుడిపూడి శేషాచార్యులు పర్యవేక్షణలో బుధవారం నిత్య హోమ, ప్రధాన హోమ, ఆలయ బలిహరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు మద్దు గోపి తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

12 నుంచి వేణుగోపాల స్వామి వార్షిక కల్యాణం

జంగారెడ్డిగూడెం: రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవం ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మంగళవారం తెలిపారు. వైఖానస ఆగమానుసారం ఆలయ అర్చకులు వాడపల్లి వెంకట శివరామ లక్ష్మణాచార్యులు పర్యవేక్షణలో పెరవలి సాయి రామాచార్యులు కల్యాణోత్సవాలు నిర్వహిస్తారన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రభాతసేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం వరకు పలు సేవల రూపేణా ఆలయానికి రూ.1,36,40 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. 1000 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు. కార్యక్రమాల ఏర్పాట్లను జవ్వాది కృష్ణ, కురగంటి రంగరావు పర్యవేక్షించారు.

పెన్సిలిన్ సృష్టికర్తకు నివాళి



ఫ్లెమింగ్‌కు నివాళులర్పిస్తున్న చిన్నారులు

కొయ్యలగూడెం: పెన్సిలిన్ సృష్టికర్త అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 70వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. కుంతలగూడెం ఎంపీయూపీ స్కూల్‌లో హెచ్‌ఎం రాయపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో ఫ్లెమింగ్ చిత్రానికి విద్యార్థులు నివాళులర్పించారు. 20వ శతాబ్దంలో ప్రాణాంతకంగా మారిన అనేక వ్యాధుల వలన లక్షలాది మంది ప్రజలు మృత్యువాత పడ్డారన్నారు. 1928లో ఫ్లెమింగ్ కనుగొన్న పెన్సిలిన్ సంజీవనిగా పని చేసిందని హెచ్‌ఎం విద్యార్థులకు వివరించారు. ఆయన కృషికి 1945లో నోబెల్ బహుమతితో ప్రపంచం సత్కరించిందన్నారు.

నేర నియంత్రణకు ప్రజలు సహకరించాలి

జంగారెడ్డిగూడెం: పటిష్ట చర్యలు చేపట్టడం ద్వారా నేర నియంత్రణకు సహకరించాలని టి.నరసాపురంలోని వ్యాపారస్తులకు ఎస్సై ఎం.జయబాబు సూచించారు. టి.నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతీ వ్యాపారస్తుడు వారి షాపుల వద్ద సీసీ కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ప్రధాన రహదారులలో, కూడళ్లలో ఏర్పాటు చేసిన షాపులకు సంబంధించి, సంబంధిత యజమానులు నైట్ వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాగరాజు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏకేఎస్ ఐఏఎస్ అకాడమీ, హైదరాబాద్ ఫ్యాకల్టీ నాగరాజు ఈ కార్యక్రమంలో ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్–1, గ్రూప్–2 సర్వీసుల పరీక్షకు ఏ రకంగా సిద్ధమవ్వాలి, పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ ఆఫీసర్ బి.అశోక్ మాట్లాడుతూ అవగాహన సదస్సులో తెలియజేసిన అంశాలను విద్యార్థులు మననం చేసుకుంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



బుట్టాయగూడెంలో మధ్యాహ్న సమయానికి పెరిగిన ఎండ తీవ్రత



జంగారెడ్డిగూడెంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- రాత్రిపూట తగ్గని చలిగాలులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

బుట్టాయగూడెం: రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్నాయి. గత 20 రోజులుగా 30 డిగ్రీలుగా నమోదైన ఎండలు గత నాలుగు రోజుల నుంచి 36 డిగ్రీలకు చేరుకున్నాయి. మండుతున్న ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం పూట ఎక్కడ నీడ దొరికితే అక్కడ సేదతీరుతున్నారు. రాత్రిపూట చలిగా ఉండడంతో కాస్త భిన్న వాతావరణం కనిపిస్తుంది. వేసవిలో మార్చినెల నుంచే ఎండలు దంచి కొట్టడంతో మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రతిరోజూ 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వివిధ పనుల కోసం బయటకు వెళ్లేవారితో పాటు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు.

11 గంటలకే పనులు ముగించుకోవాలి

ప్రస్తుత పరిస్థితుల్లో బయటకు వెళ్లినవారు తప్పకుండా 11 గంటల లోపే పనులు ముగించుకుని తిరిగి రావాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే 5 గంటల తర్వాత ఏవైనా పనులు ఉంటే బయటకు వెళ్లడం మంచిదని చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులను ఎండల తీవ్రత ఉన్న సమయంలో బయటకు పంపించవద్దని సూచిస్తున్నారు.

ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం

ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల ఏజెన్సీప్రాంతంలోని పలు గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే మంచు, ఎండల కారణంగా విపరీతంగా దోమలు పెరిగే అవకాశం ఉంది. అదేవిధంగా మలేరియా కేసులు కూడా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల పరిధిలో సుమారు 56 గ్రామాల వరకూ మలేరియా సమస్యాత్మక గ్రామాలుగా ఉన్నాయి. వీటిలో ముందస్తుగా చర్యలు చేపట్టకపోతే మలేరియా జ్వరాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సుర్రు మన్న ఎండ

జంగారెడ్డిగూడెం: ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం 9 గంటలకే భానుడి భగభగలు మొదలయ్యాయి. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు అన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఒక్కసారిగా ఎండ తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు బెంబేలెత్తారు. మార్చి మొదటి వారంలోనే ఇటువంటి ఎండలు ఉంటే, ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏమిటని ఆలోచనలో పడ్డారు. పట్టణంలో సుమారు 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అంచనా.

ఎండ తీవ్రతకు జనం విలవిల

పోలవరం రూరల్: మార్చి మొదటి వారంలోనే వడ గాలులు దడ పుట్టిస్తున్నాయి. దీంతో ప్రజలు విలవిలలాడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి భానుడు భగభగలాడటంతో పాటు వేడి గాలులు ప్రారంభమయ్యాయి. ఎండ తీవ్రతతో పోలవరం గ్రామంలోని ప్రధాన రోడ్డు మార్గాలు జన సంచారం లేక వెలవెలబోయాయి.

ఉదయం చలి, మధ్యాహ్నం ఎండలు



గిరిజన గ్రామాల్లో ఉదయం చలి, మంచు కురుస్తుండగా మధ్యాహ్నానికి ఎండలు ఠారెత్తుతున్నాయి. కాలం మార్పులతో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. మార్చి నెల ప్రారంభం కావడంతో వేసవి కాలం కూడా సమీపిస్తున్నట్లు కనిపిస్తుంది.

– మడకం వెంకటేష్, అలివేరు, బుట్టాయగూడెం మండలం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దోమల నివారణకు మలేరియా శాఖ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మే 15వ తేదీ నుంచి గ్రామాలో స్ప్రేయింగ్ పనులు చేపడతాం.

– వి.పెద్దిరాజు, సబ్‌యూనిట్ ఆఫీసర్, బుట్టాయగూడెం

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం కొయ్యలగూడెం మెయిన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు గణేష్ సెంటర్‌లో కేక్ కటింగ్, వైఎస్ఆర్ నగర్ లోని మహానేత విగ్రహం వద్ద పార్టీ పతాకావిష్కరణ, కేక్ కటింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరుకానున్నారని ప్రజా ప్రతినిధులు పార్టీ శ్రేణులు వైఎస్సార్ అభిమానులు హాజరు కావాల్సిందిగా కోరారు.

అంగన్‌వాడీ విద్యను ఆటపాటలతో బోధించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు ట్రైనింగ్ మెటీరియల్స్‌ను అందజేస్తున్న సీడీపీఓ

బుట్టాయగూడెం: అంగన్‌వాడీలోని పిల్లలకు ఆటపాటలతో అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని సీడీపీఓ ఏలూరు తులసి అన్నారు. మండలంలోని ఎస్ఆర్‌పాలెం, కేఆర్‌పురంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న రెండో దశ పోషణ్‌ బీ– పఢాయిబీ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆరు సంవత్సరాల వయస్సు గల పిల్లల పోషణ, పూర్వ ప్రాథమిక విద్య గురించి తెలియజేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు ట్రైనింగ్ మెటీరియల్స్‌ను ఆమె అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్‌ఏవీ సత్యవతి, పద్మజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మూడు లారీల సీజ్



అక్రమంగా కలపను తరలిస్తున్న లారీలను సీజ్ చేసిన అటవీశాఖ అధికారులు

కొయ్యలగూడెం: అక్రమంగా కలపను తరలిస్తున్న మూడు లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.దినేష్ పేర్కొన్నారు. మంగళవారం తెల్లవారు జామున యర్రంపేట గ్రామ సమీపంలో అక్రమంగా మారుజాతి పుల్లను మూడు లారీలలో తరలిస్తుండగా సిబ్బందితో కలిసి దాడి నిర్వహించామన్నారు. పేరుపాలెం నుంచి యర్రంపేట గ్రామానికి ఒక లారీ, కొయ్యలగూడెం సమీపంలోని ఇటుకల బట్టీ నిర్వహణకు మరో రెండు లారీల్లో కలపను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైందని రేంజర్ ఎ.శివరామకృష్ణ పేర్కొన్నారు. పట్టుకున్న కలప విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎస్‌ఓని చెక్ పోస్ట్ సిబ్బంది శివాజీని ఉన్నతాధికారులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై అసంతృప్తి

కొయ్యలగూడెం: ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాలపై చిన్నారుల తల్లులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొయ్యలగూడెంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. దీంతో కేంద్రాల ద్వారా అమలు కావాల్సిన విధి, విధానాలకు తూట్లు పడుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఉమెన్స్ డే సెలబ్రేషన్స్ వారోత్సవాలు నిర్వహించాల్సిందిగా ఐసీడీఎస్‌శాఖ ఆదేశాలు పాటించలేదన్నారు. కొన్ని కేంద్రాలలో అంగన్‌వాడీ సిబ్బంది ఉండడం లేదని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరడం లేదన్నారు. దీనిపై ఎంపీడీవో ఐసీడీఎస్ శాఖ అధికారులను వివరణ కోరినట్లు తెలిసింది.

పూలే విగ్రహం ఏర్పాటు

కొయ్యలగూడెం: మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఏప్రిల్ 11వ తేదీ నిర్వహించనున్నారు. బీసీ చైతన్య సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు వెలగల దుర్గారావు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన మంగళవారం నిర్వహించారు. పూలే 198వ జయంతి పురస్కరించుకుని బీసీ సంఘాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. సర్పంచ్ ముప్పిడి విజయకుమారి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ నిర్వహిస్తామని తెలిపారు.

‘యువత పోరు’ విజయవంతం చేయండి

నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు



చింతలపూడి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు

చింతలపూడి: సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి సర్కార్ విద్యార్థులు, యువతను, నిరుద్యోగులను మోసం చేస్తుందని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ల ముందు నిర్వహించతలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు గృహం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావు, సీహెచ్ జానారెడ్డి, మిరియాల దిలీప్, కనమత రెడ్డి చండీప్రియ, అలవాల ఖాదర్ బాబు రెడ్డి, ఎస్.కాంతారావు, ఒడిత్య కోట్లు, కొప్పుల నాగేశ్వరరావు, ఎం.ఇమ్మానియేలు, తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, సీహెచ్ నాగేశ్వరరావు, రామరాజు నాయక్, వెంపా కృష్ణ, బి.చెంచమరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాబు పాలనలో అడుగడుగునా వంచన



మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వ పాలన అడుగడుగునా వంచన, మోసాలే ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని దుద్దుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు లక్షలాది ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఉద్యోగం లేని యువకులకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తానని మోసపూరితమైన వాగ్దానాలు చేశారన్నారు. పదవులు వచ్చిన తర్వాత హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. యువతపోరు కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణంలో అన్ని వార్డులు, కౌన్సిలర్లు సమానమేనని, దీనిలో వివక్షతకు తావు లేదన్నారు. పట్టణంలో పలు సమస్యలను పరిష్కరిస్తామని, వీధి దీపాలు, పారిశుధ్యం మెరుగుపరుస్తామని ఆమె తెలిపారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు తమ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కంచర్ల గీతాకుమారి, వైస్ చైర్మన్ కంచర్ల వాసవీరత్నం, కనుమూరి లావణ్య, ముప్పన రమణ మాట్లాడుతూ పారిశుధ్య పనులు, వీధి దీపాలు సక్రమంగా లేవని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలవల తాతాజీ మాట్లాడుతూ ఇందిరా నగర్ కాలనీని అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ కేవీ రమణ మాట్లాడుతూ వీధి దీపాలు త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పట్టణంలో వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, మంచినీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు అజెండాలో పేర్కొన్న అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కమిషనర్ కేవీ రమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



రిమాండ్‌కు పంపించిన ఆరుగురు ముద్దాయిలను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బుట్టాయగూడెం: ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా విక్రయాల కేసులకు సంబంధించి ఆరుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం మంగళవారం సాయంత్రం తెలిపారు. వివరాల్లోకి వెళితే బుట్టాయగూడెం మండలం పాత రాజానగరానికి చెందిన ఒక మహిళ వద్ద ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా ముద్దప్పగూడేనికి చెందిన రాజేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే కొయ్యలగూడెం మండలంలో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా నాటుసారా కేసుల్లో పరారీలో ఉన్న ఇద్దరు ముద్దాయిలను అదుపులోకి తీసుకుని మొత్తం ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.సునీల్‌కుమార్, కానిస్టేబుల్ పి.రమ్యదుర్గ, కె.సత్యనారాయణ, పి.రాజేష్, బి.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సారా నిందితుడిపై కేసు నమోదు

కుక్కునూరు: నాటుసారా కలిగి ఉన్న వ్యక్తి పై మంగళవారం ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని బంజరగూడెం గ్రామంలో నాటుసారా అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా ఓ వ్యక్తి ఐదు లీటర్ల సారాతో పట్టుబడినట్టు చెప్పారు. కాగా ఆ వ్యక్తి వద్ద నుంచిల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు వివరించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



ఆరోగ్య పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, సిబ్బంది

ద్వారకాతిరుమల: సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ద్వారకాతిరుమల మండలం సీహెచ్‌పోతేపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. సీజనల్ వ్యాధుల నివారణ చర్యలను ఆరోగ్య సిబ్బందికి, అలాగే ఆశ కార్యకర్తలకు ఆయన వివరించారు. అనంతరం ఆరోగ్య పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, తదితర అంటు వ్యాధులు తగ్గించుకోవచ్చన్నారు. ముఖ్యంగా ప్రజలకు డెంగ్యూ జ్వరాల పట్ల, డెంగ్యూ దోమ పెరిగే స్థలాలు, ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం 16 మంది బోదకాలు వ్యాధిగ్రస్తులకు మార్బిడిటీ మేనేజ్‌మెంట్ (టబ్, టవల్, సోప్, మగ్, ఆయింట్‌మెంట్) కిట్లను వైద్యాధికారిణి డాక్టర్ యజ్ఞశ్రీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బుజ్జమ్మ, ఎల్‌టీ నారాయణ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహోధర్నాను జయప్రదం చేయండి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ సమస్యల పరిష్కారానికి మార్చి 12న నిర్వహించే చలో విజయవాడ మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం ఉపాధి హామీ కూలీలకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కేతవరం, పట్టెన్నపాలెం, శ్రీనివాసపురం, మైసన్నగూడెం, వేగవరం గ్రామాలలో ఉపాధి హామీ కూలీల వద్దకు పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు చెప్పిన విషయాలు వారి బాధలు, వేతన బకాయిలు రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని కూలీలకు హామీ ఇచ్చారు. అనంతరం జీవరత్నం మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి రావలసిన వేతన బకాయిలు మండలంలో 80 లక్షల వరకు ఉన్నాయని తక్షణమే ఈ వేతన బకాయిలు విడుదల చేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోడే సూర్యచంద్రం, కె.సుబ్బారావు, వి.నర్సిరావు, పిల్లి సుబ్బారావు, జి.సూర్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

కుక్కునూరు: సమస్యలు పరిష్కరించమని కోరినందుకు బెదిరింపులకు పాల్పడిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ మండలంలో గిరిజన భూముల్లో గిరిజనేతరులు నిర్వహిస్తున్న జామాయిల్ నర్సరీలకు కుక్కునూరు ఏఈ లంచం తీసుకొని అక్రమంగా విద్యుత్ వినియోగించుకునేందుకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్‌ను కలిసి వివరించినందుకు కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావు సీపీఎం నాయకుడిపై అసభ్యకరంగా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడినట్టు చెప్పారు. ఏఈ మోహన్‌రావు, కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న మహిళలు

జంగారెడ్డిగూడెం: విజయ దుర్గమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు మూడో రోజు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో 50 మంది మహిళలచే శ్రీచక్ర కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నసమారాధన నిర్వహించారు. అన్నసమారాధనను చిన్ని రామసత్యనారాయణ, రావూరి కృష్ణ, చింతల నాని, వేమూరి శ్రీనివాసరావు, కొప్పాక శ్రీనివాసరావులు ప్రారంభించారు. సాయంత్రం విజయదుర్గమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. రామిశెట్టి శ్రీనివాసరావు, మారిశెట్టి అంజన కుమార్, కందులపాటి సురేష్, వందనపు అప్పలరాజు, జల్లిపల్లి శివకృష్ణ, కర్పూరం తుకారం, వీరవల్లి శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు

కొయ్యలగూడెం: మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ తరగతులు చేస్తున్నట్లు ఎంపీడీవో కె.కిరణ్ మంగళవారం పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా బీసీ, కాపు, అగ్రవర్ణ పేదలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత కుట్టు మిషన్ ఉచితంగా అందిస్తామన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు లోపు బీపీఎల్ పరిధిలో ఉన్న మహిళలు అర్హులు అన్నారు. పూర్తి వివరాలకు మండల గ్రామ కార్యదర్శులను సంప్రదించాలన్నారు.